కథానిక

# నిదానం

తెన్నేటి అహల్యాదేవి

"మిస్టర్ వేణూ!" అని పిలిచాడు డాక్టర్, చెవులకు తగిలించిన స్టెతోస్కోప్ మెల్లగా తీసి జేబులో దూరుస్తూ, ముందుకు నడుస్తూ.

ఆత్రంతో రోగికేసి చూస్తూ ఉండిపోయిన వేణూ ఉలిక్కిపడ్డాడు. చేతిలో థర్మామీటర్ ఇంకా అలానే వుంది. డాక్టరుకు అందించాడు. అనుకోకుండానే, ఆయన వీధి ద్వారంవైపు నడుస్తూంటే వేణూ నిశ్శబ్దంగా అనుసరించాడు. చివరి మెట్టుమీద ఆగి వెనక్కితిరిగాడు డాక్టర్.

"ఆమెకు పదింట ఒక్కపాలుమాత్రమే జీవించే అవకాశం వుంది." అన్నాడు థర్మామీటర్ దులుపుతూ. "ఆ అవకాశంకూడా ఒక్క షరతుమీదనే ఏమైనా లాభకరం కాగలుగుతుంది"

వేణు కళ్ళు విప్పి ఆదుర్దాతో ఏమిటన్నట్టు చూశాడు. మాటరాలేదు.

"ఆ షరతేమిటంటే" మళ్ళీ అన్నాడు డాక్టర్ "ఆమె 'నేను బతకాలి' అని కోరాలి. అది లేకపోతే నా వైద్యశాస్త్రమంతా దండగే. రోగంతో సహకరిస్తానంటే, డాక్టరేమీ చెయ్యలేడు. నీ చెల్లెలు తానిక బాగుపడనని నిశ్చయించుకున్నట్టుంది. ఇంతకూ ఆమె మనసులో దిగులుకాని, బెంగకాని ఏమీలేదు కదా?"

ఏమీ అర్థం కానట్లు చూశాడు వేణు. "ఏనాటికైనా 'గీతాంజలి'ని గొప్పగా అనువాదం చెయ్యాలనుకుంటూ వుండేది." అన్నాడు, ఆలోచిస్తూ.

"అనువాదం! ప్చ్! ఏదైనా బాధించేవిషయం మనస్సులో వుందా అని...అంటే ఎవరైనా యువకుడు..."

"యువకుడా?" కొంచెం చురుగ్గా అన్నాడు వేణు, "యువకుడి కోసం దిగులు కూడా లేదు డాక్టర్. అలాంటిదేమీలేదిప్పుడు. నాకు తెలుసు."

"అలానా? ఐతే బలహీనలే కావచ్చు మరి! నా జ్ఞానం అంతా ఉపయోగించి, వైద్యశాస్త్రం చెయ్యగలిగిందంతా చేస్తాను. కాని ఆవిడ, తన కర్మకాండకి కాబోయే చుట్టాల్ని లెక్కపెట్టటం చూసినప్పుడల్లా, నేను నా ఔషధ శక్తిలో సగపాలు తీసి కట్టుగా లెక్కవేస్తున్నాను...

"వచ్చే సంక్రాంతి సంచికలో మంచి కథ రాయాలి. సెలవుల్లో అజంతా ఎల్లోరా చూసి రావాలి' ఈలాంటి ఒక్కమాట ఆమెతో అనిపించండి. ఒకటికాదు, మూడుపాళ్ళు అవకాశం వుందని మాట యిస్తాను."

వేణుకి ఆ మహాపట్టణంలో చుట్టాలెవరూ లేరు. ఎక్కడో పల్లెటూళ్ళో పుట్టాడు. ఎక్కడో వున్నారు కావచ్చుచుట్టాలు: ఇక్కడైతే చెల్లెలు వసు ఒక్కర్తే తన అనే మనిషి.

తన తండ్రినించి సంక్రమించిన ఆస్తిఅల్లా అప్పుమాత్రమే. కాకపోతే అప్పో సప్పో చేసి కష్టపడి తనకూ, తన చెల్లిలికీ బి. ఏ. దాకా చదువు చెప్పించాడు తండ్రి. తరువాత ఇంకేముంది? ఉద్యోగాలికి వెంపర్లాట! ధనవంతులకేం, రికమండేషన్ల బలం బాగా వుంటుంది. చదువే కేవలం ఆస్తిగా కలిగి, దినరాత్రులు శ్రమచేసి పైసపుట్టించి, పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యే బీదవాళ్లు థర్డుక్లాస్ ఉత్తీర్ణుల ఈ పోటీకి తట్టుకోలేరు. పరిణామం ఏమిటంటే—బతకలేక బడిపంతుళ్ళయినారు ఇద్దరూ ఒక ప్రైవేట్ హైస్కూల్లో. పైతృక ఋణాల్లో పైసపైస తీర్చివేశారు కష్టించి ఇన్నాళ్ళకు. ఇప్పుడిదేం బెడదవచ్చిపడింది?

వసు గేయ కవిత్వంలో పేరుసంపాదించింది. వేణు నలుగురిలో మంచివాడనిపించుకున్నాడు.

విద్యార్థినీ దశలో వసు ఒక యువకుణ్ణి ప్రేమించింది. అభ్యుదయ భావాలకు గని అనుకునేవారు అంతా అతని ఉపన్యాసాల్నిబట్టి. బాహాటంగా కలిసి తిరిగేవారిద్దరూ. కట్నాల వ్యామోహంలో

కాచుకుకూచున్నా అతని తలిదండ్రు లీమెని అనుమానించారు. అతడైనా ఆచరణకివచ్చేసరికి అసలు 'గిరీశం'గా తేలాడు. వసు, తప్పించుకుతిరిగే అతని యెదుటబడి ఒకనాడు బాగా చీవాట్లుపెట్టింది. ప్రేమకూ పైసాకూ తేడా తెలియని నీ చదువూ సంస్కారం తగలెయ్యనా! ఒక స్త్రీయెడ బాధ్యత గుర్తించని నీ ప్రేమంతా ఒక సిగ్గుమాలిన కపట నాటకంగదా! అని. అతడు కోపంతో పెద్ద కట్నం తీసికొని మరో రూపవతిని పెండ్లాడాడు. కడకు మిగిలిందిది. వసుకే లోకం కళంకం ఆపాదించింది. వాడితో హద్దూపద్దూలేక ఎందుకు తిరగాలంది. తుదకు పెండ్లికావడం కష్టమైంది. చెల్లెలి పరిస్థితి చూస్తూ తనూ వివాహం చేసుకోలేకపోయాడు వేణు. అప్పంతా తీరిపోవాలి, చెల్లెలి జీవితం కుదటపడాలి అని భీష్మించుకుని, కర్మక్షేత్రంలో ప్రవేశించాడు. అభిజనానికి దూరంగా, ఈ మహా పట్నంలో ప్రవాసం ఆరంభించాడు.

వెనుకటి ఘటనలన్నీ వేణు మనోనేత్రంముందు గమించిపోతున్నాయి! తమ మేడగది కిటికీనుండి, దూరంగా ఖాళీప్రదేశంలో ఒక గుబురు చెట్టు కన్పిస్తూంటుంది. వసుకి ఆ చెట్టంటే ప్రాణం. దానికి చుట్టుకొని ఒక గురివిందతీగ వుంది. మొన్న మొన్ననే గడచిన వసంత ఋతువులో ఆ చెట్టు విరియబూసింది. అక్కడక్కడా పచ్చని ఆకు అరుదుగా తొంగిచూస్తూ కనబడేది. తరచుగా, ఒక తల్లికోతి తన పిల్లలకు కొమ్మలమీద గెంతడం నేర్పుతూ ప్రత్యక్షమయ్యేది. సాయంకాలానికి కలకలారావాల మధురసంగీతంతో పక్షులగుంపు ఆ చెట్టు సౌందర్యానికి శ్రావ్య కంఠస్వరం ప్రసాదించేవి. ఆ మనోహర దృశ్యం గంటలకొద్దీ కన్నార్పక చూసేది వసు. తెల్లవారుజామున, కిటికీప్రక్కనే నిద్రించే వసుని ఈ అమాయకపు పిట్టల కూతలే మేలుకొల్పేవి. ఇంతలో ఆంధ్ర రచయిత్రుల సంఘం ప్రకృతి దృశ్యం విషయంగా, కవితారచన పోటీలు ప్రకటించారు. ఈ ప్రత్యక్ష వృక్షాన్నే కవితా వస్తువుగా స్వీకరించింది వసూ. సౌందర్యసందర్శనావేశంలో నిరాశావాదం కుంచెతో దిద్దినట్లు గేయాలు వ్రాసింది. వర్ణనా బాగానేవుంది. ఇక ఈ ఉపసంహారం? ఈ అందంఎంత కాలమనిసందేహం ప్రకటిస్తుంది. వసంతంతర్వాత శిశిరర్తువు రాకపోదు. జీవితంలో శుష్కించడం, పుష్పించడం పర్యాయ పదాలు మాత్రమే. ఈ చెట్టేమో శాశ్వతమని ఆ గురివింద తీగ ప్రాకులాడుతోంది. శిశిరర్తువు ఒకటి వుంది; ముందు కానడంలేదు అని ఏమో వ్రాసింది.

వసు సన్మానసభలో ప్రథమ బహుమానం తీసుకోడం, గేయం వింటూ శ్రోతలు దిక్కులు పిక్కటిల్లేలా కరతాళ ధ్వనులు చేయడం ఇంకా కన్నులగట్టి చెవిలో మార్మ్రోగుతున్నాయి. తాను ఆనందం పట్టలేక పోయినాడు. వసంత ఋతువు పోయింది. వర్షాఋతువులో గుబురుచెట్టు క్రొత్త శోభతో సాక్షాత్కారమైంది. జలకమాడిన రాచకన్నెలా, స్నాన సుందరిలా తోచేది. రోజులు గడిచాయి. ఇంతవరకూ గురిమింద గుబురులో మాటుపడిన——వంకరలు తిరిగి చుట్టుకుంటూ పైకి పోయిన చెట్టుకాండం——బయట పడింది. శిశిర ఋతువు వచ్చేసిందని తెలిసింది వసుకి.

పేటఅంతా ఏదో శీతపైత్య జ్వరం వచ్చి అల్లుకుపోతోంది. చలి; అకాల వర్షాలు; ఇక, ఈ భయంకరమైన ఆగంతుకుడు అడుగుపెట్టని ఇల్లులేదు. వైద్యులకు తీరికలేదు.

ఉన్నట్లుండి, ఒకనాడు సాయంత్రం వసుకి కూడా జ్వరం సోకింది. క్రమంగా ఎక్కువైంది. చిక్కిశల్యమై పోతోంది వసు. వేణు నిస్సహాయంగా నిలబడి పోయాడు. రోడ్డెక్కి వెళ్ళిపోతున్న డాక్టరు కారుకేసి చూస్తూ.

కొంత సేపటికి తాను మెట్లెక్కుతున్నట్లు తెలిసికొన్నాడు వేణు. వసు మనస్సు మరల్చాలి. ఆశాభావం రేకెత్తించాలి ఆమెలో. ఆమెతో ఉత్సాహంగా, హాస్య సంభాషణలు చేయాలి. మునిమాణిక్యం కథలు వినిపించాలి—— అని ఏమేమో సంకల్పించుకుంటున్నాడు. చివరకి ఒక తమాషా చెయ్యాలనుకున్నాడు. "బానారసీ సిల్కు చీరలు...వాయిలు గుడ్డలు శాటీన్ గుడ్డలు..." అంటూ గొంతుమార్చి అరిచాడు. గది తలుపు దగ్గరగా, కాని వసు తలత్రిప్పియైనా చూడలేదు. వేణుకు చాల నిరుత్సాహం కల్గింది. కుర్చీలో కూలబడి శూన్యంలోకి చూస్తూ కూచున్నాడు. ఏదో అస్పష్టమైన ధ్వని వినపడింది. వసు నిశ్చలంగా పడుకుంది.

మళ్ళీ వినపడింది. వేణు ఆలకిస్తున్నాడు. సన్నగా, అనేక సార్లుగా, మళ్ళీ మళ్ళీ వినపడింది. అది ఆమె కంఠం ధ్వనే. చటుక్కున లేచాడు వేణు, ఆమె మంచం కిటికీ ప్రక్కనేవుంది. కన్నులు విప్పి బయటకు చూస్తూనే వుంది వసు. వేణుకి భయమేసింది. ఆమె అంకెలు లెక్క పెడుతోంది—కాని తలక్రిందుగా! వెనక్కి!!

"పన్నెండు" వసు అంటున్నది. కొంచెమాగి, "పదకొండు" తర్వాత "పది" మళ్ళీ వుండి, "తొమ్మిది" ఈసారి ఇంచుమించు ఒకేసారిగా, "ఎనిమిది—ఏడు."

ఆత్రంతో కిటికీలోంచి అవతలివైపు పార చూచాడు వేణు. ఏముందక్కడ లెక్క పెట్టేందుకు! పాడుపడిన ఇల్లు. దాని ఆవరణలో అదే గుబురుచెట్టు. మొండిగోడ ప్రక్కగా ఆ బయలు పడిన మ్రోడు! పురుగుతిన్న వ్రేళ్ళు. ఆకులన్నీ చలిగాలి ఊపులు దూసిపోయినై. అస్థిపంజరం మిగిలిన మనిషిలాగుంది.

"ఏమిటి వసూ అది?" ధైర్యంచేసి అడిగాడు

"ఆరు" అన్నది వసు రహస్యంగా, "అబ్బ! చాలా తొందరగా రాలిపోతున్నాయి ఎందుకో ఇవ్వాళ."

"ఏమిటవి?"

"మూడు రోజుల క్రింద సుమారో వంద వుండేవి. లెక్క పెట్టలేక తలనొప్పివచ్చేది. ఇప్పుడెంతో తేలికైంది. అదుగో! ఇంకోటిపోయింది. ఇక ఐదే మిగిలివున్నై ఇప్పుడు" అన్నది ఉద్రేకంతో.

"ఐదేమిటి? ఏమిటా ఐదు? చెప్పమ్మా వసూ" అన్నాడు జాలిగా.

"ఆకులు ఆ గుబురుచెట్టు ఉండలా? దానివి. చిట్టచివరిది పడిపోగానే నేనూ పోవాల్సివుంటుంది. మూడు రోజుల్నించీ చూస్తున్నాను."

వేణుకు ఏడుపొచ్చింది. కోపంకింద మారింది. "అరె! ఇదా సంగతి!" అప్రయత్నంగా అన్నాడు. "ఎక్కడా విన్లేదు ఇలాంటి వెఱ్ఱి కల్పనలు! ఛీఛీ! ఎంత మూర్ఖత్వం. అడవి మనుషులు కూడా నవ్వి పోతారు ఇలాంటి పిచ్చినమ్మకాలు వింటే!"

వసు మాటాడలేదు. తలత్రిప్పి శూన్యంగా నవ్వింది "నీదొక పిచ్చినమ్మకం" అన్నట్లు. వేణు మళ్ళీ అన్నాడు పరదీన స్వరంతో బుజ్జగిస్తూ "నీ ఆరోగ్యం కుదటబడటానికీ, ఆ ఎండుటాకుల రాలుడికీ ఏం సంబాధం వసూ! ఆ చెట్టుమీద నీకెంతో ఇష్టంగాబట్టి ఇలా భావిస్తున్నావు కావచ్చు ఇంత చదువుకున్న దానివి వెఱ్ఱిదానివై పోతే ఎలాగమ్మా... ఈ ఉదయమే డాక్టరు నాతో అన్నాడు, చక్కగా నయమయ్యే అవకాశం వుందని. ఏంలేదు. సంతోషంగా వుండు. కాఫీ తీసుకురానా? నీవు సంతోషంగావుంటే, నీ అన్నకి వెయ్యేనుగుల బలం వస్తుంది. పోస్టాఫీసుకు పోయి పైసలు తెస్తాను. బజార్లో మంచి పండ్లు తెస్తాను నీకు. డాక్టర్ చెప్పాడు బలం వస్తుందని."

"నాకేమీ తేనక్కరలే దన్నయ్యా!"

"మంచి హాస్య కథలు తెచ్చాను. నీకు చదివి వినిపించాలని."

"నా కోసం ఏమీ శ్రమ పడవద్దు." మళ్ళీ కిటికీ వైపు తలత్రిప్పి అన్నది వసు, చెట్టుమీదికి దృష్టి పోనిస్తూ," అదిగో ఇంకోటి పడుతోంది. వద్దు. నాకు ఏ కాఫీవద్దు. సరిగ్గా నాలుగే మిగిలాయి. చీకటి పడకముందే, చివరిది కూడా పడిపోతే బావుండును. చూస్తాను. ఆపైన నేనూ కన్ను మూస్తాను."

"చెల్లాయ్!" మంచంమీదికి వంగి అన్నాడు వేణు, "కళ్లు మూసుకో నువ్వు మాట్లాడితే నాకు ధ్యాసనిలవదు. చాలా పనివుంది. నా పని అయ్యేదాక కిటికిలోంచిచూస్తేపట్టే.కిటికీ తెర దీసేస్తాను."

"ప్రక్క గదిలోకి పోయి పనిచేసుకోరాదూ!" అంది వసు చిరాకుగా.

"నీ దగ్గర లేకుండా ఎలా పోనమ్మా? ఐనా, ఆ పిచ్చి ఆకులకేసి చూడ్డానికి వీల్లేదు నువ్విక" అన్నాడు వేణు ఆవేశంలో.

"సరే! నీ పని కాగానే నాతో చెప్పు" నిశ్చలంగా పడుకుని అన్నది వసు కళ్ళు మూసుకుంటూ, "చివరి ఆకురాలి పోవడం నేను చూడాలి. విసుగెత్తి పోయింది. ఎంత కాలమని కాసుకు కూచోను? హాయిగా, అలిసిపోయిన వాటిల్లో ఒక ఆకు లాగా చల్లగా, నేనూ జారిపోతాను."

"చాలు వసూ! పడుకో, నిద్రపట్టించుకో ఇప్పుడేవస్తాను. నే వచ్చేదాకా కదలకూడదు. నా మీద వట్టే."

తత్తర పడుతూ నడకే సాగని కాళ్ళతో, కంగారుగా దూసుకుపోతున్నాడు వేణు.

'దామూతాత' పేరుగల చిత్రకారుడు. కాని అతని పేరుకి కారణం కళమాత్రం కాదు. అతని ప్రవర్తనే. బ్రహ్మచారి దేవేంద్రనాథ ఠాకూరు లాగా ఒక పెద్దగెడ్డం. ఎటుపోయినా చిన్నపిల్లలంతా చుట్టూ మూగుతారు. ఇక ఆయన జేబులు చాక్లెట్లతో, బిస్కట్లతో గోదాములే, వాళ్ళతో ఆడుకుంటూ, చాక్లేట్లు పంచిపెడుతూ, ఆనందిస్తూంటాడు 'దా మూ తా త' ఇరుగూ పొరుగూ ఏ సాయం కావలసివచ్చినా 'దామూ తాత'నే అడుగుతారు. కష్టసుఖాలు చెప్పుకుంటూంటారు వచ్చి.

కథల పత్రికలకు బొమ్మలు గీయడం, ఎడ్వర్టయిజ్‌మెంట్ బోర్డులు రాయడం అతని వృత్తి.

దామూ తాతకి ఏ కోరికాలేదు. కాని, తన జీవితాన్ని చిరస్థాయిగా చేసే ఒక్క సర్వోత్తమ కళాకృతి సృష్టించాలని మాత్రం అనుకుంటూండే వాడు. అనుకుంటూనే అరవై యేళ్ళ మీదికి వచ్చినై. కుంచె చేతపట్టి 40 ఏళ్ళ పైగా అయింది. ఏంలాభం? తనూ ఒక రవివర్మ కావాలి. అవుతాడు. వస్తుంది ఆ సువర్ణ ఘడియ. ఇక, తన సర్వోత్తమ చిత్రానికి రోజూ ప్రారంభోత్సవం చేసేవాడు. కాని ఆవేశం సన్నివేశం కలిసి రావాలిగా మరి కళ అంటే! తొందరపడితే ఎలా? మరోసారి ప్రారంభిద్దాం అనుకొని ప్రయత్నం విరమించుకునేవాడు. అందుచేత, సర్వోత్తమ చిత్రం ఏదీ ఇంతవరకు తయారుకాలేదు. దామూతాత బాగా తిని తిరిగేవాడు. తను సృష్టించబోయే చరమ చిత్రాన్ని గూర్చి కలలు కంటూండేవాడు ఎప్పటికప్పుడు.

వేణు హడావిడిగా మెట్లు దిగి తన గదిలో ప్రవేశించేసరికి "దాముతాత" తాపీగా పెద్ద విదేశపు చుట్ట పీలుస్తున్నాడు ఘుప్పుఘుప్పున రైలు ఇంజనులా పొగవదుల్తూ. ఒక మూల డ్రాయింగ్ బోర్డుమీద 25 సంవత్సరాలనించీ భగీరథ తపస్సు చేస్తూ, అతని 'సర్వోత్తమ తైలవర్ణ చిత్రపు' తొలి రేఖకు ఎదురుచూస్తూన్న కాన్వాస్‌గుడ్డ బిగించి వుంది, గంభీరంగా దృష్టి నాకర్షిస్తూ.

ఒక్కక్షణంలో వేణు సంగతులన్నీ దాము తాతకు చెప్పేశాడు. "నిజంగా పండుటాకులానే వుంది వసు. ఆ చివరి ఆకుతో పాటు తానూ రాలిపోవడం తథ్యంకావచ్చు. ఎలా తప్పించాలి ఈ ప్రళయం? ఏమన్నా ఉపాయం చెప్పుతాతా!" అని ముగించాడు.

దామూ తాత వెకిలిగా నవ్వి, ఘాటుగా అన్నాడు: "హుఁ! ఆకులు రాల్తున్నాయా? రాల్తే మనుషులు చస్తారూ? వెధవ బోడిచెట్టు. పీకి అవతలపారెయ్యకపోయినావ్. ఇదేం పిచ్చిపట్టుకుంది వసూకి? ఐనా ఇలాంటివాటికి ఎవళ్ళంవచ్చి ఏంచేస్తామోయ్! చచ్చేచలిగావుంది, రేపుచూదాం కానీ."

వేణు అన్నాడు: "అలాకాదు. పరిస్థితి చాలా విషమంగా వుంది. జ్వరం, బలహీనత ఈ పిచ్చి ఊహకు దారితీసినై. నీవు వచ్చి ఏమన్నా చెప్పు తాతా! నీ అట్టహాస ధోరణికి మనస్సేమన్నా మారుతుందేమో. తరువాత నా అదృష్టం" గద్గద స్వరంతో ముగించాడు వేణు.

"ఏమిటోయ్ ఇది! ఆడదాన్లా మాట్లాడు తావ్. నేనెట్టా రాకుండావుంటాను? పద చెప్తాను. అంత వళ్ళు దాచుకుంటానా? అందరం చచ్చే వాళ్ళమే. చూడు, ఎప్పుడో నా సర్వోత్తమ చిత్రం తయారౌతుంది. నేనూ కన్నుమూస్తాను... రామ్‌రామ్" అన్నాడు దామూ తాత, ఆవులిస్తూ, చిటికలు వేస్తూ.

ఇద్దరూ వెళ్ళి చూసేసరికి వసు నిద్రపోతోంది. వేణు పిల్లిలాగా పోయి కిటికీతలుపులు బంధించాడు. ప్రక్కగదిలోకి పోయి కిటికీలోగుండా భూతంలా నిశ్చలంగావున్న ఆ చెట్టు మోడుకేసి చూశారు, ఒక్కనిముషం నిశ్శబ్దంగా కన్నార్పకుండా. సాయంత్రంనించీ విరామం లేకుండా వానపడుతోంది. చలిగాలి విసరులు మోత చేస్తున్నాయి బయట. కొంతసేపు మాటాడి దామూతాత వెళ్ళిపోయాడు. వసు గాఢనిద్రలో వుంది.

మరుసటి తెల్లవారు ఝామున మెలకువచ్చింది వసుకి. తన ప్రక్కనే, ఎఱ్ఱటి కళ్ళతో మూసిన కిటికీవైపు చూస్తూ కూర్చున్న వేణు కనబడ్డాడు.

"తలుపులు తియ్యి" అన్నది వసు.

"వద్దు." అన్నాడు వేణు చటుక్కున.

"చూడకుండా ఉండలేను" పెకలించుకున్న శక్తితో వసూ అంది, "చూసి తీరాలి నేను."

అయిష్టంతో, వణికే చేతుల్తో మెల్లగా తెరిచాడు వేణు. ఆశ్చర్యంతో అదిరిపడ్డాడు.

"అరే! అదిగో!!" అన్నాడు అప్రయత్నంగా. ఎడాపెడా కొట్టేవాన. రంయి రంయి మని గాలి విసుళ్లు. ఎలా నిల్చివుంది ఆ ఒక్క ఆకు? ఎండు కొమ్మ నంటిపెట్టుకొని అదే చివరి ఆకు ఆచెట్టు మీద. పాలిపోయి, కళదప్పిన పసుపు రంగుతో, నేలకొక యిరవై అడుగుల ఎత్తున ఎలా వ్రేలాడుతోంది ధైర్యంగా.

వసు మాటల్తో వేణుకు స్పృహకలిగింది, "చిట్టచివరి ఆకది. రాత్రికి రాలిపోతుందనుకున్నాను. గాలి మోతలు వింటూనే వున్నాను. ఇవ్వాళ తప్పక పడుతుంది. అప్పుడే నేనూ కన్నుమూస్తాను."

"వసూ! చెల్లాయ్!! నాకోసమైనా అలాంటి మాటలు అనవద్దు. ఈపాడు ఊహ మనసులోంచి తీసై. నీకేం ఫరవాలేదు. నామాట విను." అన్నాడు మళ్ళీ దిగజారి బరువెక్కిన హృదయంతో.

వసు మారుపల్కలేదు. ప్రశాంత అంతిమ యాత్రచేసే వారనుభవించే నిశ్చలభావం ఏకాంతత్వం గోచరిస్తున్నాయి ఆమెలో.

పగలు గడిచింది. సాయంత్రమైంది. సంజ వెలుగులోకూడ ఆ ఆఖరుకు స్పష్టంగా కనపడుతోంది. అంతిమ శ్వాసదాకా ప్రాణిని అంటిపెట్టుకొని వుండే ఆశలాగా రాత్రి అయింది. గాలి జోరుగా తోసింది. మళ్ళీ భోరున వాన కురిసింది. వీధుల్లో వాగుల పారేయి ఆ రాత్రి.

ఉషఃకాలపు వెలుతురు రాగానే మళ్ళీ కిటికీ తెరవమని నిర్దాక్షిణ్యంగా ఆజ్ఞాపించింది వసు కాదనటానికి గుండెలులేవు. తెరవటానికి చేతుల రావు. తెరవక తప్పదు.

ఆఖరి ఆకు ఇంకా అలానేవుంది!

వసు ఏకదృష్టితో దాన్నే చూస్తూ ఉండిపోయింది చాలసేపు చివరకు వేణుని పిలిచింది. "నేను చెడ్డదాన్ని వేణూ! తెలివి లేకపోయింది నా క్రూరత్వం అవివేకం నిరూపించడానికి ఏదో శక్తి ఆ ఆకుని పట్టివుంచింది. రాలిపోకుండా భావాలనుకోవడం నీచం. నేను కాఫీ తాగుతాను కొంచెం సేపు కూచోవాలనివుంది. దిండ్లు ఎత్తుపెట్టి, కుంకం బరిణె, అద్దం ఇలా ఇయ్యన్నా!"

వేణు ఎక్కడున్నడో జ్ఞాపకం చేసుకొంటూ, తన్ను తానూ సంబాళించుకొంటున్నాడు. ఒక గంట తర్వాత మళ్ళీ అంది వసు. "అన్నా తప్పక గీతాంజలి అనువాదం చేస్తాను, ఒకనాటికి. ఉత్తమ రచయితననిపించుకుంటాను."

మధ్యాహ్నం డాక్టర్ వచ్చాడు. "ఓ! రోగం కుదిరినట్లేనమ్మా ఇక. పోషన తగిన ఆహారంవుంటే చాలు. ఒక్కవారంలో చక్కగా తిరుగుతావు... మంచిది. పోతాను. దామూ తాతని చూడాలి."

వసుఆశ్చర్యంతో అడిగింది, 'దామూతాతనా?'

"అవును. న్యుమోనియా. పాపం వృద్ధుడు తీవ్రంగా తగిలింది. ఎక్కువ రక్షణగా వుంటుందని ఆస్పత్రిలో చేర్పించాను."

మరుసటి రోజు డాక్టర్ వేణుతో అన్నాడు, "ఆమె కింకేంభయమూలేదు. గెల్చావు చివరికి! ఆహారం, రక్షణ అంతే ఆమెకి కావాల్సింది."

మర్నాడు సాయంత్రం, వసు మంచం దగ్గరకి పోయి చెప్పాడు వేణు, "నీతో ఒక విచిత్ర విషయం చెప్పాల్సివుంది చెల్లాయ్!"

ఏమిటన్నట్లు చూసింది వసు ఆశ్చర్యంగా.

"దామూ తాత ఇవ్వాళ ఆస్పత్రిలో చనిపోయాడు." కళ్లు తుడుచుకున్నాడు వేణు, మళ్ళీ చెప్పటానికి ప్రయత్నిస్తూ, "మూడే రోజులు జబ్బులో బాధపడింది. కొరడుబారిపోయి, తడిసి ముద్ద అయి మెట్లదగ్గిర పడివుంటే చూశారట అటు మొన్నరాత్రి. అంత కాళరాత్రివేళ ఎక్కడికి పోయి వుంటాడో ఎవ్వరూ ఊహించలేక పోయారు. ప్రక్కనే ఇంకా వెలుగుతూండిన ఒక లాంతరు, నిచ్చెన, రంగుకుంచెలు పడివున్నాయట."

కొంచెం సేపు నిశ్శబ్దం తాండవించింది. వేణూ కిటికీలో గుండా బయటికి చూస్తూ మళ్ళీఅన్నాడు "చూడు! గోడమీది బొమ్మలాగా ఆ ఆకు అంత గాలి వీచినా అది కదలనైన కదలలేదు. నీకూ అనుమానం కల్గలేదు. చెల్లాయ్! అది 'దామూ తాత' సర్వోత్తమ చిత్రం. జీవిత కళాఖండం. ఆఖరి ఆకురాలి పోగానే దాని స్థానంలో అతడే: చిత్రించాడక్కడ!"

(మాతృక: ఓ. హెన్రీ ఆంగ్లకథ)